క్లుప్తంగా

సినీ పరిశ్రమ అభివృద్ధిపై చర్చ జరగాలి

తెనాలిరూరల్: రాష్ట్రంలో సినీ పరిశ్రమ అభివృద్ధిపై శాసన సభలో చర్చ జరగాలని సినీ దర్శకుడు దిలీప్‌రాజా కోరారు. శుక్రవారం పెదరావూరులోని తన కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. సగటు మనిషికి వినోదాన్ని అందించే సినిమాను నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. పైరసీ నిరోధక చట్టాన్ని అన్ని రాష్ట్రాల్లోనూ నామమాత్రంగానే అమలు చేయడం దురదృష్టకరమన్నారు. మా-ఏపీ తీర్మానాన్ని కేంద్ర సమాచార శాఖ మంత్రికి పంపినట్లు తెలిపారు. ఈ సమావేశంలో నటుడు మిలటరీ ప్రసాద్, అమీర్ చౌధురి, ఇంటూరి విజయ భాస్కర్, న్యాయ సలహాదారుడు కనపర్తి మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

పండ్లు పంపిణీ



తెనాలిరూరల్: స్వాతంత్ర్య సమరయోధుడు ప్రగడ కోటయ్య జయంతిని పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ రాష్ట్ర వైస్ చైర్మన్ గుర్రం ద్వారకా శ్రీను ఆధ్వర్యంలో శుక్రవారం మహాత్మా సేవా శాంతి ఆశ్రమంలో 40 మంది వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. జగ్గడిగుంటపాలెం ప్రగడ కోటయ్య నగర్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు.

నేడు అబ్దుల్ కలాం వర్ధంతి సభ

తెనాలి: భారత మాజీ రాష్ట్రపతి, ప్రఖ్యాత శాస్త్రవేత్త ఏపీజే అబ్దుల్ కలాం 9వ వర్ధంతి సభను శనివారం తెనాలిలో నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణానికి చెందిన అబ్దుల్ కలాం సేవా సమితి, గ్యార్మీ జెండా కమిటీ, గంగానమ్మ పేట మిత్ర మండలి సంయుక్త ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు గంగానమ్మ పేటలోని పాత శివాలయం వద్ద వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రక్తదాన శిబిరం, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్స్ పంపిణీ, పేదలకు అన్నదానం జరుగుతాయని తెలిపారు. వివరాలకు నిర్వాహకులు షేక్ కాలేషావలి 94404 38811, షేక్ మీరావలి 94401 38147కు సంప్రదించాలని పేర్కొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోండి

సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ విజయలక్ష్మి



తెనాలిఅర్బన్: టీచ్ టూల్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ విజయలక్ష్మి పేర్కొన్నారు. తెనాలిలో జరుగుతున్న టీచ్ టూల్ శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల్లో బోధన సమర్థ్యాన్ని పెంపొందించేందుకు ఈ శిక్షణను ఏర్పాటు చేసిందన్నారు. అనంతరం ఉపాధ్యాయుల నుంచి శిక్షణపై ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. ఈ సమావేశంలో పలువురు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వృద్ధులకు ప్లేట్లు పంపిణీ



తెనాలిరూరల్: మండలంలోని కఠెవరానికి చెందిన కూచిపూడి ప్రసూన చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం నంది వెలుగు గ్రామంలోని జాషువా నగర్‌లో 25 మంది వృద్ధులకు ప్లేట్లు పంపిణీ చేశారు. నంది వెలుగు జెడ్పీ హైస్కూలు ప్రధానోపాధ్యాయురాలు గోళ్ల శివపార్వతీ తన తండ్రి జ్ఞాపకార్థం ప్లేట్లను అందజేసినట్లు ట్రస్ట్ వ్యవస్థాపకుడు కూచిపూడి జాన్‌బాబు తెలిపారు. అలాగే పాఠశాల ఉపాధ్యాయుడు సుబ్బారావు దాతృత్వంతో గ్లాసులను పంపిణీ చేశారు. దాతలు తమ ట్రస్ట్ ద్వారా తోడ్పాటు అందించవచ్చని జాన్‌బాబు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మంగళగిరి: మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ పరిధిలోని కాజ టోల్ ప్లాజా వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. కాజ టోల్ ప్లాజా సమీపంలోని సాయిబాబా ఆలయం వద్ద ఓ యువకుడు ద్విచక్ర వాహనంపై జాతీయ రహదారిని దాటుతుండగా విజయవాడ వైపు వెళ్లే లారీ ఢీకొంది. కిందపడిన యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు, ట్రైనింగ్ డీఎస్పీ అక్కడికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యసన బాల్యం..

చోరీల బాటలో ప్రయాణం

- చోరీల కేసుల్లో నిందితులుగా మైనర్లు
- వ్యసనాలకు బానిసై దొంగతనాలు
- ఈజీ మనీ కోసం..భవిష్యత్తు అంధకారం
- కొరవడిన తల్లిదండ్రుల పర్యవేక్షణ
- ఆందోళన కలిగిస్తున్న నేర ప్రవృత్తి



ఇటీవల గంజాయి కేసులో అరెస్టయిన మైనర్లు, నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రమేష్(ఫైల్)

తెనాలిరూరల్: చెడు స్నేహాలు, తల్లిదండ్రుల పర్యవేక్షణ కొరవడడంతో చిన్నతనంలోనే కొందరు బాలలు నేరాలకు పాల్పడుతున్నారు. తెలిసీ తెలియని వయసులో చేస్తున్న పొరపాట్లతో బంగారు భవిష్యత్తును అంధకారం చేసుకుంటున్నారు. ఇటీవలి కాలంలో పోలీసులు ఛేదించిన కొన్ని చోరీ, గంజాయి కేసుల్లో మైనర్లు అరెస్టవ్వడం ఆందోళన కలిగించే అంశం. అరెస్టయిన వారందరూ చెడు స్నేహాలు చేసి, వ్యసనాలకు బానిసలై ఖర్చులకు కోసం చోరీలు మార్గంగా ఎంచుకున్న వారే.

- పట్టణ నందుల పేటకు చెందిన సయ్యద్ అయాజ్ ఐటీఐ వరకూ చదివి గుంటూరు ఆటో నగర్‌లోని ఓ షాపులో పని చేస్తున్నాడు. చెడు వ్యసనాలకు అలవాటు పడి, సులువుగా డబ్బు సంపాదించేందుకు మోటార్ సైకిళ్లను చోరీ చేయాలని నిర్ణయించుకున్నాడు. బైక్ మెకానిక్‌గా పని చేస్తున్న 15 ఏళ్ల మైనర్ సహకారం తీసుకున్నాడు. ఇద్దరూ కలిసి ఇళ్ల ముందు తాళం వేసి ఉన్న బైక్‌లను మారు తాళాలతో చోరీ చేయడం ప్రారంభించారు. ఈ విధంగా తెనాలి నందులపేట, నరేంద్రదేవ్ కాలనీల్లో రెండు పల్సర్ బైక్‌లు చోరీ చేశారు.
- గుంటూరు నెహ్రూ నగర్‌కు చెందిన వేముల రేణుకారావు అలియాస్ పండు మరో 14 ఏళ్ల బాలుడు స్నేహితులు. చెడు వ్యసనాలకు బానిసలైన వీరు ఖర్చులకు కోసం బైక్ చోరీలను ఎంచుకున్నారు. ఇద్దరూ కలసి తెనాలి బుర్రిపాలెం రోడ్డులో ఉంటున్న బాలుడి అక్క ఇంటికి జులైలో వచ్చారు. పట్టణంలోని పినపాడు, చెంచుపేట డొంక రోడ్డు, మారీసు పేటలో మూడు బైక్‌లను అపహరించుకెళ్లారు. ఆగస్టులో వీరిని పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు పంపారు.
- తాజాగా విద్యార్థులు, యువతే లక్ష్యంగా గుంటూరు, బాపట్ల జిల్లాల్లో గంజాయి విక్రయిస్తున్న ముఠా సభ్యులు ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేసి, రెండు కిలోల గంజాయిని స్వాధీన పర్చుకున్నారు. అరెస్టయిన ముగ్గురిలో 17 ఏళ్ల మైనర్ ఉండగా మరో నలుగురు పరారీలో ఉన్నారు. విశాఖ జిల్లా నుంచి గంజాయిని తీసుకువచ్చి విద్యార్థులు, యువతకు విక్రయిస్తున్నారు.

తల్లిదండ్రులకు కౌన్సెలింగ్..

మైనర్లు అసాంఘిక కార్యకలాపలకు పాల్పడి పోలీసులకు పట్టుబడుతుండడం విచారకరం. వివిధ కేసుల్లో నిందితులుగా ఉన్న మైనర్లతో పాటు వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్నాం. చెడు వ్యసనాల దుష్ప్రభావాలపై పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన సదస్సులు న్వహించాం. విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా చర్యలు తీసుకుంటాం. పిల్లలు ఏం చేస్తున్నారు.. ఎవరితో స్నేహం చేస్తున్నారన్న విషయాలను తల్లిదండ్రులు నిత్యం గమనిస్తూ ఉండాలి.

– ఎం.రమేష్, డీఎస్పీ, తెనాలి

- పట్టణంలోని ఇస్లాం పేటకు చెందిన షేక్ అమరుల్లా, షేక్ మొహిద్దీన్ మరో ముగ్గురు మైనర్ బాలురు ముఠాగా ఏర్పడ్డారు. చెడు వ్యసనాలకు బానిసలైన వీరు తరచూ చోరీలకు పాల్పడ్డారు. ఈ క్రమంలో గతేడాది నవంబరు 3న రాత్రి ఓ ఆటో బ్యాటరీని చోరీ చేసి, తీసుకెళ్తుండగా.. వీఎస్సార్ కళాశాల వద్ద తనిఖీల్లో త్రీ టౌన్ పోలీసులకు తారసపడ్డారు. అనుమానాస్పదంగా ఉండడంతో వారిని అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించారు. దీంతో తెనాలి ప్రభుత్వ వైద్యశాల రోడ్డులో నడచి వెళ్తున్న ఓ వ్యక్తిపై దాడి చేసి.. సెల్‌ఫోన్, నగదు అపహరించామని, అలానే ఓ ఇంట్లో యాక్టివ చోరీ చేశామని అంగీకరించారు. నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు రిమాండ్‌కు పంపారు.
- తెనాలి మండలం అంగలకుదురుకు చెందిన కొండముది అఖిల్ అలియాస్ టోని, సోడాగుడి జాన్‌పాల్, కోపల్లెకు చెందిన మైనర్ బాలుడు స్నేహితులు. చెడు వ్యసనాలకు అలవాటు పడ్డ వీరు తమ జల్సాలకు డబ్బుల కోసం చోరీల బాట పడ్డారు. అంగలకుదురులో ఒక బైక్‌ను, అదే గ్రామంలోని జగనన్న కాలనీలో అలాగే కోపల్లె గ్రామంలో వాటర్ మోటార్లను చోరీ చేశారు. వీరిలోలని బాలుడు విజయవాడ వన్ టౌన్ పరిధిలో మరో బైక్‌ను చోరీ చేశాడు. అంగలకుదురు గ్రామంలో చోరీ కేసులపై దర్యాప్తు చేసిన రూరల్ పోలీసులు నిందితులను గుర్తించి, వారి కదలికలపై నిఘా ఉంచారు. జూన్‌లో వీరిని అరెస్ట్ చేశారు.

రైల్వే వంతెనకు మరమ్మతులు



గ్రౌటింగ్ కెమికల్‌ను వంతెన జాయింట్లలోకి ఎక్కిస్తున్న సిబ్బంది

తెనాలిరూరల్: తెనాలి–రేపల్లె మార్గంలోని వైకుంఠపురం రైల్వే వంతెన మరమ్మతులను రైల్వే అధికారులు చేపట్టారు. సుమారు శతాబ్దం క్రితం నిర్మించిన వంతెన పటిష్టత కోసం గ్రౌటింగ్ పనులు చేపట్టారు. తెనాలి–రేపల్లె రైల్వే లైను(బ్రాడ్ గేజ్) 1916లో ప్రారంభమవగా అంతకు ముందే ఈ వంతెన నిర్మాణం పూర్తయ్యింది. కొండరాళ్లతో వంతెనను నిర్మించి, రైలు మార్గాన్ని ఏర్పాటు చేశారు. ఈ వంతెన పటిష్టతను పెంచేందుకు ప్రస్తుతం అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకోసం ఎపోక్సీ గ్రౌట్‌తో వంతెన రాళ్ల మధ్యలోని రంధ్రాలు, ఇతర పగుళ్లను పూడ్చుతున్నారు. గ్రౌటింగ్ వల్ల మరి కొన్నేళ్ల పాటు వంతెనకు ఎటువంటి ఇబ్బంది ఉండదని రైల్వే వర్గాలు చెబుతున్నాయి.

'విజయ దివస్' ర్యాలీ



తెనాలిఅర్బన్: దేశభక్తిని అందరూ పెంపొందించుకోవాలని 22వ ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్, లెఫ్టినెంట్ కల్నల్ జె.మహేష్ పిలుపునిచ్చారు. బెటాలియన్ ఆధ్వర్యంలో కార్గిల్ 'విజయ దివస్' ర్యాలీని శుక్రవారం పట్టణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్గిల్ యుద్ధంలో భారత్ విజయం సాధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పి.వి.సుధారాణి, ఎన్‌సీసీ అధికారులు కె.స్వామి, పి.వెంకట భాస్కర్, కె.అశోక్, ఎస్‌సీఆర్ స్కూల్, కేఎస్ఎం స్కూల్ ఎన్‌సీసీ విద్యార్థులు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చేనేత వస్త్రాలపై జీఎస్టీ రద్దు చేయాలి



ప్రగడ కోటయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ హనుమంతరావు తదితరులు

మంగళగిరి: చేనేత వస్త్రాలపై జీఎస్టీ రద్దు చేయాలని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చేనేత పితామహుడు ప్రగడ కోటయ్య 109 జయంతి కార్యక్రమం పట్టణంలోని పద్మశాలీయ బహుత్తమ సంఘం కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ హనుమంతరావు సంఘం నాయకులతో కలిసి కోటయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. చేనేత పరిశ్రమ అభివృద్ధికి, శ్రామికుల సంక్షేమానికి ఎనలేని కృషి చేసిన పితామహుడు కోటయ్య అని కొనియాడారు. చేనేత కార్మికులు కష్టపడి తయారు చేసే వస్త్రాలపై కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ వసూలు చేయడం దారుణమన్నారు. రాష్ట్రంలోని పార్టీలు చేనేత కార్మికుల స్థితిగతులు గమనించి చేనేత వస్త్రాలపై జీఎస్టీ తొలగించడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు చింతక్రింది కనకయ్య, దామర్ల కుబేర స్వామి, గంజి రవీంద్రనాథ్, రామనాథం పూర్ణచంద్రరావు, జొన్నాదుల భిక్షారావు, బిట్రా భాస్కరరావు, రామనాథం పరమేశ్వరరావు, సందుబట్ల భూపతి, అల్లక తాతారావు తదితరులు పాల్గొన్నారు.

సక్రమంగా చెత్త సేకరణ



తెనాలి అర్బన్: చెత్త సేకరణను సక్రమంగా నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పారిశుద్ధ్య సిబ్బందిని ఆదేశించారు. పట్టణంలోని 9, 30 వార్డుల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. అక్కడ జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. చెత్తను వేర్వేరుగా ప్రతి రోజూ సేకరించాలని స్పష్టం చేశారు. రోడ్లపై చెత్త లేకుండా చూడాలని చెప్పారు. అలాగే మురుగు కాల్వలను పూడిక తీయాలని సూచించారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాజీ, పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన ట్రైనీ కలెక్టర్లు



ఆరోగ్య కేంద్రంలో అందిస్తున్న సేవలను ట్రైనీ కలెక్టర్లకు వివరిస్తున్న డాక్టర్ మానస

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని తాడేపల్లి డ్రైవర్స్ కాలనీలో ఉన్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆరుగురు ట్రైనీ కలెక్టర్లు శుక్రవారం సందర్శించారు. ప్రజలకు అందజేస్తున్న వైద్యసేవలు, లేబరేటరీలో నిర్వహిస్తున్న పరీక్షలు, అందుబాటులో ఉన్న మందుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, సూపర్‌వైజర్లు, సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్ల విధులు, సేవలు అందిస్తున్న తీరును త పరిశీలించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ మానసను, స్టేట్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రమాదేవిని, సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో ఏపీ ఆరోగ్యశ్రీ సీఈవో డాక్టర్ జి.లక్ష్మయ్య, మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీమన్నారాయణ, సీహెచ్‌వో గురుకుమార్, హెల్త్ సూపర్‌వైజర్లు, సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన అవసరం

తాడికొండ: ఆధునిక యుగంలో విద్యార్థులు చదువుతోపాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె. నాగ శ్రీనివాసరావు సూచించారు. శుక్రవారం తాడికొండ మండలం మోతడక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కృత్రిమ మేధపై నిర్వహించిన అవగాహనా సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... నూతన సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకోవడం ద్వారా విద్యార్థులు సమాజంలో ఉన్నత స్థాయికి ఎదగవచ్చన్నారు. కార్యక్రమంలో అకడమిక్ డీన్ డాక్టర్ పి. ఫణికుమార్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విభాగాధిపతి సుంకర శాంతిప్రియ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేఎల్‌యూను సందర్శించిన ఆస్ట్రేలియా బృందం



డాక్టర్ ఫ్రాన్సెస్కో పొలోచ్చి బృంద సభ్యులను సత్కరిస్తున్న డాక్టర్ ఎం. కిషోర్‌బాబు

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్‌యూను శుక్రవారం ఆస్ట్రేలియా సిడ్నీలోని న్యూకాజిల్ యూనివర్సిటీ ప్రతినిధుల బృందం సందర్శించింది. ఈ సందర్భంగా కేఎల్‌యూ విదేశీ సంబంధాల డీన్ డాక్టర్ కిషోర్ బాబు మాట్లాడుతూ.. ఆస్ట్రేలియా వర్సిటీకి చెందిన ఆచార్యులు డాక్టర్ ఫ్రాన్సెస్కో పొలోచ్చి ఆధ్వర్యంలో బృందం వచ్చిందన్నారు. ఆస్ట్రేలియాలో ఉన్నత విద్య అభ్యసించేందుకు అవకాశాలు, పరిశోధన వసతుల గురించి విద్యార్థులకు వివరించారని తెలిపారు. ఉన్నత విద్యకు వెళ్లాలనుకునే వారి సందేహాల నివృత్తికి ప్రత్యేక కేంద్రాన్ని ప్రారంభించామని చెప్పారు. డాక్టర్ ఫ్రాన్సెస్కో పొలోచ్చిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కేఎల్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ పార్థసారథి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్. వెంకట్‌రామ్, డాక్టర్ కె. రాజశేఖరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ బాలికల వసతి గృహంలో తనిఖీ

తాడేపల్లి రూరల్: దుగ్గిరాల గ్రామ పరిధిలోని ఎస్సీ బాలికల హాస్టల్‌ను శుక్రవారం సోషల్ వెల్ఫేర్ డీడీ డి. మధుసూదనరావు తనిఖీ చేశారు. ఉదయమే హాస్టల్‌కు చేరుకుని విద్యార్థినులు బస చేసే గదులతోపాటు పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. హాస్టల్‌లో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా.. భోజనం సమయానికి కావాల్సినవి పెడుతున్నారా.. విద్యాశాఖ ఏర్పాటు చేసిన మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా..? వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ఘనంగా కోటయ్య జయంతి



మంగళగిరి: చేనేత ఉద్యమనేత ప్రగడ కోటయ్య జయంత్యుత్సవాన్ని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. కోటయ్య చిత్రపటానికి శుక్రవారం పట్టణంలోని సంఘం కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కోటయ్య సేవలను కొనియాడారు. భారతీయ చేనేత పరిశ్రమపై అనేక పరిశోధనలు చేసి సంఘాలను ఏర్పాటు చేసిన కోటయ్య ధన్యులని పేర్కొన్నారు. అనంతరం కదిరి శాసనసభ్యుడు కందికుంట వెంకటప్రసాద్‌ను సత్కరించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు కుమ్మర క్రాంతికుమార్, జిల్లా అధ్యక్షుడు పారేపల్లి మహేష్, ఉప్పాల రాజ్‌కిరణ్, కొల్లూరి హనుమంతరావు, అక్కినపల్లి బాపయ్య, భాస్కర్, జంజనం వరప్రసాద్, పారేపల్లి దుర్గాప్రసాద్, పవన్, గోపి తదితరులు పాల్గొన్నారు.

పోలవరం ప్రాజెక్ట్ ముంపు బాధితులకు రోటరీ సాయం



సాయం అందజేస్తున్న రోటరీ క్లబ్‌ల బాధ్యులు

తెనాలి: పోలవరం ప్రాజెక్ట్ ముంపు బాధితులకు రోటరీ తరఫున టార్పాలిన్లు, దోమ తెరలు, నిత్యావసరాలను సమకూర్చారు. రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం, హైదరాబాద్ జూబ్లీ హిల్స్, తాడేపల్లి, మంగళగిరి క్లబ్‌ల తరఫున బాధ్యులు శుక్రవారం వాటిని బాధితులకు అందజేశారు. బాగా నష్టపోయిన రామచంద్రాపురం మండలం శ్రీరామ్‌గిరి గ్రామస్తులకు ఈ సహాయాన్ని అందించినట్లు తెనాలి రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. పంట పొలాలు, ఇళ్లు మునిగిపోవటంతో ఆ గ్రామస్తులు సమీపంలోని అడవిలో గుట్టలపై, తాత్కాలిక పాకల్లో నివసిస్తుండటం బాధ కలిగించిందన్నారు. అక్కడి ఎంపీడీఓ ఫణికుమార్ రెడ్డి చేసిన సూచన మేరకు వారికి సామగ్రి అందించినట్లు వెల్లడించారు. సహాయ కార్యక్రమంలో రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎలెక్ట్ ఎస్వీ రాంప్రసాద్, వివిధ క్లబ్‌ల అధ్యక్షులు గాజులు శ్రీనివాస్, రావూరి రమేష్, రోటరీ డిస్ట్రిక్ట్ క్యాబినెట్ సభ్యుడు ఈదర వెంకట పూర్ణచంద్, నల్లూరి వెంకటేశ్వరరావు, సుకుమార్‌రెడ్డి పాల్గొన్నట్లు శ్రీనివాసరావు తెలిపారు.

డ్రోన్‌తో యాంటీ లార్వా మందు పిచికారీ



డ్రోన్‌ను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ రాధిక, కమిషనర్ శేషన్న

తెనాలిఅర్బన్: జిల్లాలో ఎక్కడా లేని విధంగా తెనాలి పట్టణంలో దోమల వ్యాప్తిని అరికట్టేందుకు డ్రోన్‌తో యాంటీ లార్వా మందును స్ప్రే చేస్తున్నట్లు మున్సిపల్ చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ బండి శేషన్న తెలిపారు. స్థానిక నాల్గొవ వార్డులోని బీసీ కాలనీ, 23వ వార్డులోని కొబ్బరి తోటల వద్ద శుక్రవారం డ్రోన్‌తో యాంటీ లార్వా మందు పిచికారి కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాలామైన స్థలాల్లో నీరు నిలిచి ఉండడం వల్ల దోమల వ్యాప్తి పెరుగుతోందన్నారు. దీంతో వ్యాధులు ప్రబలుతున్నాయని తెలిపారు. దోమలను అరికట్టేందుకు వినూత్నంగా తెనాలిలో డ్రోన్‌తో మందును పిచికారి చేయిస్తున్నట్లు వివరించారు. ఈ ప్రక్రియ పట్టణంలో కొనసాగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, కౌన్సిలర్ అడుసుమల్లి వెంకటేశ్వరరావు, ఆరోగ్యాధికారి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, మలేరియా అధికారులు శ్రీకంఠ ఉమాకాంత్, చరసాని ప్రభాకర్‌రెడ్డి, పలువురు సచివాలయ, మున్సిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉపకార వేతనాల అందజేత



విద్యార్థులకు డిక్షనరీలు పంపిణీ

తాడేపల్లి రూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని డాక్టర్ కొత్త రఘురామయ్య మెమోరియల్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు శుక్రవారం విద్యా ఉపకార వేతనాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దోస్త్ సంఘం అధ్యక్షులు నన్నపనేని నాగేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ.. విద్యార్థులు ఉన్నత శిఖరాలను చేరుకోవాలంటే చదువు ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని అన్నారు. అందరూ కష్టపడి చదవాలని సూచించారు. దోస్త్ జనరల్ సెక్రటరీ జాగర్లమూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. చదువుతోపాటు క్రీడలు, పర్యావరణ పరిరక్షణ, సామాజిక సేవపై విద్యార్థులు దృష్టి పెట్టాలని కోరారు. కళాశాల ప్రిన్సిపల్ కొత్త గిరిధరరావు మాట్లాడుతూ.. ఎస్‌కే అఖిల, ఎం.మహాలక్ష్మి, స్నేహసాగర్ తదితరులు మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందుకున్నారని వివరించారు. అనంతరం విద్యార్థులకు ఆంగ్ల డిక్షనరీలు బహూకరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్ అధికారి బి.రాంబాబు, విద్యార్థుల తల్లిదండ్రులు, కొండపనేని రవీంద్ర, జంపాల నరేంద్ర, కె. సరళాదేవి, ఎం.విజయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థినికి మంత్రి లోకేష్ ఆర్థిక సాయం



విద్యార్థినికి చెక్ అందిస్తున్న మంత్రి నారా లోకేష్

తాడేపల్లి రూరల్: మంగళగిరి నియోజకవర్గ పరిధిలోని చినకాకానికి చెందిన వైద్య విద్యార్థిని గండికోట కార్తికకు శుక్రవారం మంత్రి నారా లోకేష్ తన నివాసంలో ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా విద్యార్థిని తండ్రి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. తమ కుమార్తె ఉజ్బెకిస్తాన్‌లోని ఓ మెడికల్ అకాడమీలో 4వ సంవత్సరం వైద్యవిద్య చదువుతోందని తెలిపారు. చదువుకు సాయం అందించాల్సిందిగా నారా లోకేష్‌కు ఉండవల్లి ప్రజాదర్బార్‌లో వినతి పత్రం ఇచ్చామని పేర్కొన్నారు. దీంతో ఆయన రూ.1.43 లక్షలను వ్యక్తిగతంగా చెక్కు రూపంలో లోకేష్ తన నివాసంలో అందించారని చెప్పారు. విదేశీ విద్య పథకానికి నూతన గైడ్‌లైన్స్ రూపొందించిన తరువాత ప్రభుత్వం ద్వారా మరింత సాయం అందించే అంశాన్ని పరిశీలిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు.

కీలక ప్రాంతాల్లో సీసీ కెమెరాలతో నిఘా

సీఐ సీహెచ్ ప్రభాకర్‌రావు వెల్లడి



పోలీస్‌స్టేషన్ ఎదుట రోడ్డుపై సీసీ కెమెరా ఏర్పాటు

తాడికొండ: జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు తాడికొండ మండలంలోని అన్ని గ్రామాల్లో రద్దీ కూడళ్లు, ప్రధాన రహదారుల వెంట సీసీ కెమెరాల ఏర్పాటు పనులు చురుగ్గా సాగుతున్నట్లు తాడికొండ సీఐ సీహెచ్ ప్రభాకరరావు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రమైన తాడికొండలో పోలీస్ స్టేషన్, బస్టాండ్ తదితర రద్దీ ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు పనులను ఆయన పరిశీలించారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట ఏర్పాటు ఆవశ్యకతపై డాక్యుమెంటు రైటర్లతో చర్చించారు. రాజధాని ప్రాంతం నేపథ్యంలో రిజిస్ట్రేషన్ కోసం వచ్చే వారు ఇక్కడ నగదు లావాదేవీలు అధికంగా జరిపే అవకాశం ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తగా సీసీ కెమెరాలు అందరూ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గంజాయి విక్రేతలు, రౌడీషీటర్లపై ఉక్కుపాదం మోపేందుకు ఇప్పటికే మైకులో ప్రచారం నిర్వహిస్తున్నామని చెప్పారు. తాడికొండ మండలంలో ఇలాంటి నేర ప్రవృత్తి కలిగిన వ్యక్తుల కదలికలపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు పీడీ యాక్టు నమోదు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ విషయాల్లో సమస్యలు తలెత్తితే నేరుగా తన ఫోన్ నంబర్ 86888 31374కు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వ్యక్తుల వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

డీజిల్, పెట్రోలు చోరుల అరెస్టు

మేడికొండూరు: వాహనాల్లోని డీజిల్, పెట్రోలు చోరీకి పాల్పడుతున్న వ్యక్తులను మేడికొండూరు పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. సీఐ జయకుమార్ కథనం ప్రకారం... పేరేచర్ల గ్రామానికి చెందిన ఓర్సు వెంకట పవన్ కళ్యాణ్, చింతపల్లి శ్రీను, దాసరి రునాల్డ్ రాజులు చెడు వ్యసనాలకు బానిసలయ్యారు. మండల పరిధిలోని గ్రామాల్లో ఆగి ఉన్న వాహనాలలో డీజిల్, పెట్రోలు చోరీకి పాల్పడుతున్నారు. అనంతరం ఇతరులకు విక్రయిస్తున్నారు. ఈనెల 18న పేరేచర్లలో పీయూఎస్ స్టోన్ క్రషర్‌లోని జేసీబీలో 150 లీటర్ల డీజిల్ చోరీకి గురైందని యజమాని ఫిర్యాదు చేశారు. సీసీ ఫుటేజీల ఆధారంగా చోరీకి పాల్పడిన ముగ్గురిని శుక్రవారం ఉదయం పేరేచర్లలో అరెస్టు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జయకుమార్ తెలిపారు. నిందితులను కోర్టులో హాజరు పరచగా, 14 రోజులపాటు రిమాండ్ విధించినట్లు పేర్కొన్నారు. నిందితులను చాకచక్యంగా వ్యవహరించి పట్టుకున్న ఎస్సై వాసు, కానిస్టేబుల్ సిద్దయ్య, రామారావు, కోటేశ్వరరావులను సీఐ అభినందించారు.